సాక్షి రంగారెడ్డి

సోమవారం ; 20 ; ఫిబ్రవరి ; 2023

బెట్టింగ్‌కు బానిసై ..



ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. తమ్ముడికి వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు దర్యాప్తులో ఉంది. 8లో▸



రాజరాజేశ్వరుడికి పూజలు

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మూడో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 8లో▸



క్రీడాకారిణి జైష్వి విన్యాసం

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించిన అధికారులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆర్‌జేడీ, పరీక్షల నియంత్రణ అధికారి జయప్రదబాబు, ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి వెంక్యానాయక్, డెక్ సభ్యులు అనసూయ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన ల్యాబులు, ఇతర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రాణి తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు పరీక్షలు ఉంటాయని, రెగ్యులర్ విద్యార్థులు 231 మంది, ఒకేషనల్ విద్యార్థులు 94 మంది హాజరవుతున్నారని ఆమె చెప్పారు.

తండ్రి చేతిలో కుమారుడి హతం



హన్మంత్‌రెడ్డి (ఫైల్)

కేశంపేట: తండ్రీకొడుకుల మధ్య జరిగిన ఘర్షణ కుమారుడి మరణానికి దారితీసింది. ఈ సంఘటన మండల పరిధిలోని ఇప్పలపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పలపల్లికి చెందిన టి.హన్మంత్‌రెడ్డి (37) షాద్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. తండ్రి గోవర్ధన్‌రెడ్డితో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన గోవర్ధన్‌రెడ్డి రాడ్డుతో కుమారుడిపై దాడి చేశాడు. దీంతో హన్మంత్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధనుంజయ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

దేవాలయాలకు ప్రాధాన్యత

టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



మంచు శివలింగ దివ్య దర్శనం అనంతరం నిర్వాహకులతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

హుడాకాంప్లెక్స్: దేవాలయాలకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇచ్చి.. అధిక నిధులు విడుదల చేసి అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రజాహిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అమర్‌నాథ్ మంచు శివలింగ దివ్య దర్శనం, లేజర్‌షో ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీనివాస్‌గుప్తా దర్శించుకుని మాట్లాడారు. ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం అద్భుతమని పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని.. దేశ ప్రధాని కావాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక దేవాలయాల్లో పనిచేసే బ్రాహ్మణులు, పూజారులకు సరైన గౌరవం లభిస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల ఖర్చులు కూడా చెల్లిస్తున్నట్లు చెప్పారు.

ఉత్సాహంగా 'క్లబ్ రన్'

రాయదుర్గం: గచ్చిబౌలిలో హెచ్‌సీయూ, హైదరాబాద్ రన్నర్స్ సంయుక్తంగా నిర్వహించిన వార్షిక రన్నింగ్ ఈవెంట్ క్లబ్‌రన్ ఆదివారం హెచ్‌సీయూ క్యాంపస్‌లో సందడిగా సాగింది. ఈవెంట్‌లో పది కిలోమీటర్లు, హాఫ్ మారథాన్ 21.1 కిలో మీటర్ల విభాగాలుగా నిర్వహించారు. 21.1 కిలోమీటర్ల పరుగును మెహిదీపట్నం కంటోన్మెంట్‌లోని బ్రిగేడియర్ గణేశ్ నాగరాజన్ జెండా ఊపి ప్రారంభించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో పది కిలోమీటర్ల పరుగును హెచ్‌సీయూ ప్రొ.వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్ ఎస్ సర్రాజు ప్రారంభించారు. జంట నగరాల నుంచి దాదాపు 3 వేల మంది రన్నర్లు ఈ ఈవెంట్‌లో పాల్గొనడం విశేషం. అన్ని విభాగాల్లో ముగ్గురు రన్నర్స్‌ను హైదరాబాద్ రన్నర్స్ అధ్యక్షుడు అభిజీత్ మద్నూర్కర్, శ్రీనివాస్ మునిపల్లె, రేస్ డైరెక్టర్ అజిత్ మిశ్రాలు సత్కరించి మెడల్స్ బహూకరించారు.


జిమ్నాస్టిక్స్.. అదుర్స్





ఏరోబిక్ జిమ్నాస్టిక్‌లో పాల్గొన్న చిన్నారులు





జిమ్నాస్టిక్స్‌లో బంగారు పతకం సాధించిన హర్యానాకు చెందిన క్రీడాకారిణి ఒషీన్




తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కోహినూర్ కప్ ఇంటర్నేషనల్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆద్యంతం అలరించాయి. పంజాబ్, కర్ణాటక, హర్యానా, భోపాల్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీ పడుతున్నారు. ఆదివారం ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

– హుడాకాంప్లెక్స్



రిథమిక్ జిమ్నాస్టిక్ ప్రదర్శన

కంట్లో.. కలవరం



- దుమ్ము,ధూళి కణాలతో ముప్పు
- దెబ్బతింటున్న కంటిచూపు
- 'కంటి వెలుగు' పరీక్షల్లో నిర్ధారణ
- నిర్లక్ష్యం చేస్తే ముప్పు తప్పదంటున్న వైద్య నిపుణులు
- సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

కంటి వెలుగు క్యాంపులు:	80
మొత్తం కంటి పరీక్షలు:	2,10,315
రీడింగ్ గ్లాసుల పంపిణీ:	39,055
ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అవసరమైన వారు:	34,202
సర్ఫస్‌ఐ బాధితులు:	5 నుంచి 6 శాతం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దుమ్ము ధూళి కణాల మధ్య తిరగడం.., కంటి అద్దాలు, హెల్మెట్ లేకుండా బైక్‌పై కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించడం.. హార్మోనల్ ఇన్‌బ్యాలెన్స్.. ఇన్‌ఫెక్షన్లు.. తరచూ సూర్యుడి వైపు చూడటం.. వెరసి కంటి చూపును దెబ్బతీస్తున్నాయి. వైద్య పరిభాషలో 'టెరిజియం/సర్ఫస్ ఐ'గా చెప్పుకొనే (కంట్లో కండరాల పెరుగుదల) సమస్యకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నెల రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్క్రీనింగ్స్‌లో ఇవే అంశాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా 25–35 ఏళ్ల వయస్సులో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. చికిత్సను నిర్లక్ష్యం చేస్తే ఆ కండరాలు కార్నియాను పూర్తిగా కప్పేసి కంటిచూపును దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

74 వేల మందికి చూపు సమస్యలు

'కంటి వెలుగు'లో భాగంగా గత నెల 19 నుంచి ఈనెల 16 వరకు జిల్లాలో 37 ఆరోగ్య కేంద్రాల పరిధిలో 80 క్యాంపుల ద్వారా నేత్ర పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 2,10,315 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 74 వేల మందికి కంటి చూపు సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇప్పటి వరకు 39,055 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేయగా, 34,202 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు సిఫార్సు చేశారు. ఆయా బాధితులకు కంటి అద్దాలు ఇంకా అందాల్సి ఉంది. కంటి జబ్బులు నిర్ధారణ అయిన బాధితుల్లో 0.5 శాతం మంది కంట్లో కండరాల సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్నియాపై తెల్లని కండరాలు పేరుకుపోవడంతో కంటి చూపు దెబ్బతింటోంది. ఈ సర్ఫస్ ఐ బాధితుల్లో దుమ్ముధూళి కణాలు ఎక్కువగా ఉండే రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించే యువతీ, యువకులే ఎక్కువ శాతం ఉండటం విశేషం. వైద్యులు వీరికి సర్జరీ సిఫార్సు చేయడం గమనార్హం.

జాగ్రత్తలు తీసుకోవాలి



సూర్యుని కిరణాల వైపు తదేకంగా చూసే వారు, రోడ్డు ప్రయాణికులు, వెల్డింగ్, సిమెంట్ పని చేసే కార్మికులు, బొగ్గు గనులు, ప్లాస్టిక్ కంపెనీలు, అల్యూమినియం కంపెనీల్లో పని చేసే కూలీలు ఎక్కువగా టెరిజియం బారినపడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కంట్లో మట్టి, ఇసుక, నలుసు పడకుండా జాగ్రత్త వహించాలి. కంప్యూటర్, టీవీ, ఫోన్ వంటి వాటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. కంటినిండా నిద్రపోవాలి. తరచూ చన్నీటితో కళ్లను శుభ్రం చేసుకోవడం ద్వారా ఇన్‌ఫెక్షన్ల బారినపడకుండా కాపాడుకోవచ్చు. లేదంటే కంటి దురద వంటి సమస్యలు తలెత్తుతాయి. నిర్లక్ష్యం చేస్తే చూపును శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది.


– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి



ర్యాలీ ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని హిందువాహిని ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన శోభాయాత్ర



నివాళి తారకరత్న పార్థివ దేహానికి పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నారు.



శివాజీనగర్ కాలనీలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి తదితరులు

శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకమని.. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి చందన చెరువు కట్ట, 44వ డివిజన్ శివాజీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన శివాజీ మహరాజ్ విగ్రహాలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భావితరాలకు శివాజీ చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందన్న ఉద్దేశంతోనే మీర్‌పేట ప్రాంతంలో రెండుచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మంచి పనులు చేసే వారికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. అనంతరం మంత్రి మీర్‌పేట సిర్లాహిల్స్ ప్రాథమికోన్నత పాఠశాలలో మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పోరెడ్డి పద్మ భాస్కర్‌రెడ్డి, ధరంకార్ జ్యోతికిషోర్, శివాజీనగర్ కాలనీ అధ్యక్షుడు అంగర నాగరాజారావు, కార్యదర్శి నెల్లికొండ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మకానికి హెచ్‌ఎండీఏ భూములు

- మూడు జిల్లాల పరిధిలో 39 ల్యాండ్ పార్సిళ్లు
- 121 నుంచి 10,164 గజాల స్థలాలు
- ఈ నెల 21 నుంచి ప్రీ బిడ్ సమావేశాలు
- మార్చి 1న 39 ల్యాండ్ పార్సిళ్లకు ఈ–ఆక్షన్

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు ప్రాంతాల్లోని హెచ్‌ఎండీఏ స్థలాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. అందుబాటు ధరల్లో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎమ్మెస్టీసీ ఈ వేలం ప్రక్రియను నిర్వహించనుంది. మధ్యతరగతి ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డెవలపర్లు ఈ ల్యాండ్ పార్సిళ్లను కొనుగోలు చేసేందుకు అనుగుణంగా స్థలాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఔటర్‌రింగ్ రోడ్డుకు దగ్గరలో 39 ల్యాండ్ పార్సిళ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 10, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 6 ప్లాట్‌లు, సంగారెడ్డి జిల్లాలో 23 ల్యాండ్ పార్సిళ్లు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ స్థలాల వివరాలను కేఎంఎల్ ఫైల్ ద్వారా చూసుకునే సదుపాయం ఉంది. 121 నుంచి 10,164 గజాల వరకు ఈ స్థలాలు ఉన్నాయి. గండిపేట వద్ద 3 ప్లాట్‌లు, శేరిలింగంపల్లిలో 5, ఇబ్రహీంపట్నంలో 2 ప్లాట్‌లు అమ్మకానికి ఉన్నాయి. మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లిలో 4, ఘట్కేసర్‌లో 1, బాచుపల్లిలో 1 చొప్పున ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్‌లో 16, ఆర్‌సీపురంలో 6 ప్లాట్‌లు, జిన్నారంలో ఒకటి చొప్పున స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆన్‌లైన్ వేలం

39 స్థలాలను మార్చి 1న ఎమ్మెస్టీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించనున్నారు. క్లియర్ టైటిల్ కలిగిన ఈ స్థలాలను కొనుగోలుచేసిన వారు సత్వరమే భవన నిర్మాణ అనుమతులు పొందేందుకు అవకాశం ఉంది. ఆన్‌లైన్ వేలంలో పాల్గొనడానికి వీలుగా ఈ నెల 27న సాయంత్రం 5 గంటల వరకు ఎమ్మెస్టీసీలో నమోదు చేసుకోవాలి. మరుసటిరోజు సాయంత్రం 5 గంటలలోపు నిర్దేశించిన ఈఎండీ (ధరావత్తు) రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. ఈనెల 21న రంగారెడ్డి జిల్లా పరిధిలోని స్థలాలకు శేరిలింగంపల్లి జోనల్ ఆఫీసులో, 22న సంగారెడ్డి జిల్లాలోని స్థలాలకు ఆర్‌సీపురంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో 23న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థలాలపై ఉప్పల్ సర్కిల్ ఆఫీసులో ప్రీ బిడ్ సమావేశాలు నిర్వహించనున్నారు.

పీరంచెరువులో మహిళ కిడ్నాప్

- కారులో తీసుకెళ్లి లైంగిక దాడి
- భర్తకు ఫోన్ చేయడంతో వెలుగులోకి
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

మణికొండ: ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఇంట్లో విధులు ముగించుకుని వస్తున్న పని మనిషిని ఇద్దరు వ్యక్తులు కారులో కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆమె మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీరంచెరువులో తన కుటుంబంతో పాటు ఉంటున్న మహిళ సమీపంలోనే ఉన్న గేటెడ్ కమ్యూనిటీలో పని మనిషిగా చేస్తోంది. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం పనులు ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి వస్తున్న క్రమంలో బాచుపల్లికి చెందిన శుభం శర్మ, సుమిత్ కుమార్ శర్మ తమ కారులో (టీఎస్ 15యూసీ 9730) ఆమెను కిడ్నాప్ చేశారు. అక్కడి నుంచి కిస్మత్‌పూర్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. తమ వాంఛ తీర్చాలని ఆమెను బలవంతపెట్టారు. దీనికి ఆమె అంగీకరించకపోవటంతో శారీరకంగా హింసించారు. అక్కడితో ఆగకుండా ఆమె మెడలో ఉన్న 2.5 తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. సదరు మహిళ తేరుకుని తన భర్తకు ఫోన్ చేయటంతో అతను ఘటనా స్థలం నుంచి ఆమెను తీసుకుని నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గంటల వ్యవధిలోనే నిందితుల పట్టివేత..

కిడ్నాప్, లైంగిక దాడికి గురైన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. సీసీ టీవీ పుటేజీలు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం 12 గంటల వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నేరాన్ని అంగీకరించటంతో వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 2.5 తులాల బంగారు గొలుసు, కిడ్నాప్‌కు పాల్పడిన కారు, రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గంటల వ్యవధిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించటంలో కృషి చేసిన నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్, డీఐ శివకుమార్, క్రైం ఎస్సై అశోక్‌వర్మ, హెడ్‌కానిస్టేబుల్ బద్రినాథ్, కానిస్టేబుల్‌లు అంజిలప్ప, శ్రీశైలంలను రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, నార్సింగి ఏసీపీ రమణగౌడ్ అభినందించారు.

బెట్టింగ్‌కు బానిసై యువకుడి ఆత్మహత్య

ఇక బతకలేను..
- అమ్మానాన్నలను బాగా చూసుకోవాలంటూ తమ్ముడికి వాట్సాప్ మెసేజ్


రాజశేఖర్ (ఫైల్)

పహాడీషరీఫ్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సీ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లికి చెందిన చుక్క చంద్రయ్యకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రాజశేఖర్(26) శంషాబాద్ విమానాశ్రయంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. ఈ క్రమంలో తల్లి బంగారాన్ని తాకట్టు పెట్టాడు. ఈ నెల 18న బంగారం గురించి తల్లి అడిగింది. తీసుకరావడానికి కొంత సమయం పడుతుందని చెప్పి రాత్రి డ్యూటీకి వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున 2.44 గంటల ప్రాంతంలో తమ్ముడు పవన్‌కు వాట్సాప్ మెసేజ్ పంపాడు. "శంషాబాద్ పాత పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న బంగారం దుకాణంలో రూ. 40 వేలకు అమ్మ నగలు తాకట్టు పెట్టాను.. ఇందుకు సంబంధించిన రసీదు తన ఫోన్ పౌచ్‌లో ఉంది.. నా కారణంగా అమ్మ నాన్నలు బాధ పడుతున్నారని.. బెట్టింగ్‌లకు బానిసయ్యాను.. వారిని మంచిగా చూసుకో.. నేను చనిపోతున్నాను" అని మెసేజ్ పంపాడు. తెల్లవారుజామున పవన్ పాలు పితకడానికి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ చెట్టుకు వేలాడుతూ రాజశేఖర్ విగతజీవిగా కనిపించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి అదృశ్యం


గీతాదేవి, శివానీ (ఫైల్)

పహాడీషరీఫ్: కుమార్తెతో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాం కాలనీకి చెందిన గీతాదేవి కోల్(27), బినోద్ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నెల 13న బినోద్ డ్యూటీకి వెళ్లి రాత్రి వచ్చి చూడగా భార్య, కుమార్తె శివానీ కోల్(5) కనిపించలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో వస్త్రాలు, కొంత నగదు కూడా కనిపించలేదు. వారి ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా, సెల్ నంబర్ 94906 17241లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వ్యక్తి మృతదేహం లభ్యం


మహేందర్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: స్థానిక పెద్ద చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్‌ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరిగూడ గ్రామానికి చెందిన నరాల మహేందర్(52) అదే గ్రామ పట్నం పెద్ద చెరువు బ్యాక్ వాటర్‌లో స్నానం చేసేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నీటి మునిగిపోయాడు. గల్లంతైన మహేందర్ కోసం డీఆర్ఎఫ్ బృందం వెతికినా ప్రయోజనం లేకపోయింది. తిరిగి ఆదివారం ఉదయం గాలించగా మృతదేహం లభ్యమైయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్

తుక్కుగూడ: బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని, కుటుంబ పాలన సాగుతోందని ఆరోపించారు. ఎనిమిదేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఇందు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ కే మధుమోహన్, కౌన్సిలర్లు బీ యాదగిరి రెడ్డి, రాజమౌని రాజు, నాయకులు తాళ్ల అశోక్‌గౌడ్, రాజు, కృష్ణ, శ్రీనివాస్, శివయ్య, జాపాల సుధాకర్, బరిగెల రాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

హయత్‌నగర్: ఇంట్లో గుట్టుగా పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన శనివారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పిల్లి రమేష్, దేశారం బాలకృష్ణ, దండెం రామచంద్రారెడ్డి, ఇటికల అంజిరెడ్డి, బుయ్య జ్ఞానేశ్వర్, బుయ్య మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 19,020 నగదు, 6 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పక్కా ప్లానింగ్..

సనత్‌నగర్: రూ.7 కోట్ల విలువైన వజ్రాభరణాలు ఉన్న కారుతో పరారైన డ్రైవర్ శ్రీనివాస్ ఆచూకీ కోసం ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. యజమానితో నమ్మకంగా ఉంటూనే పథకం ప్రకారమే అదును చూసి నగలతో ఉడాయించినట్లు తెలుస్తోంది. మాదాపూర్‌లోని మైహోం భుజ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న జ్యువెలరీ వ్యాపారి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ రూ.7 కోట్ల విలువైన వజ్రాభరణాలతో పరారైన విషయం విదితమే. మధురానగర్‌లోని అనూష అనే మహిళకు రూ.50 లక్షల విలువైన ఆభరణాలు ఇచ్చేందుకు సేల్స్‌మెన్ అక్షయ్‌తో కలిసి వచ్చిన శ్రీనివాస్ నగలు ఉన్న కారుతో సహా ఉడాయించాడు. ఇదిలా ఉండగా ప్లాన్ ప్రకారమే అతను నగలను దోచుకెళ్లినట్లు స్పష్టమవుతోంది. పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరుకు చెందిన శ్రీనివాస్ మూడు నెలల క్రితమే నగరానికి వలస వచ్చాడు. ఎస్సార్‌నగర్ సమీపంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ మహిళా జ్యువెలరీ వ్యాపారి రాధిక వద్ద పనిలో కుదిరాడు. నగరంలోని వివిధ దుకాణాల నుంచి వజ్రాభరణాలను కావలసిన వారికి రాధిక సరఫరా చేస్తుంటుంది. ఈ క్రమంలోనే దుర్బుద్ధి పుట్టిన శ్రీనివాస్ ఎలాగైనా వాటిని కాజేయాలని పథకం వేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. రెండు రోజుల ముందుగానే భార్యను బెంగళూరుకు పంపి, తన ఇద్దరు కుమారులను సోదరుల వద్ద వదలడం చూస్తే పక్కా ప్లాన్‌గా స్పష్టమవుతోంది.

రంగంలోకి ప్రత్యేక బృందాలు..

బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌ను పట్టుకునేందుకు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు రంగంలోకి దిగారు. ముందుగా శ్రీనివాస్ తీసుకువెళ్లిన కారు నెంబర్‌ను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపి అప్రమత్తం చేశారు. శ్రీనివాస్ కారును ఒకచోట వదిలేసి బైక్‌పై శ్రీశైలం రోడ్డులోకి వెళ్లినట్లు గుర్తించారు. సీసీ ఫుటేజీలు, ఇతర పోలీస్‌స్టేషన్ల నుంచి అందిన సమాచారం మేరకు శ్రీనివాస్ వెళ్లి మార్గంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. శ్రీనివాస్‌ను పట్టుకుంటామని ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

రాజరాజేశ్వరుడి సేవలో భక్తజనం

భజనలు, భక్తిగీతాలాపన
- పాల్గొన్న ప్రముఖులు


శివగంగ రాజరాజేశ్వర ఆలయం

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మూడో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం మంగళ గౌరీశ్వరుడు, మల్లీశ్వరుడు, అఘోరేశ్వరుడు, కాశీపతీశ్వరుడు, గంగాధరేశ్వరుడు, ఇష్టకామేశ్వరుడు, ముక్తేశ్వరుడు, ఏకాంబరేశ్వరుడు, అమరావతీశ్వరుడు, హరిహరేశ్వరుడు, అమరేశ్వరుడు, మణికర్ణికేశ్వరుడు, మహానందీశ్వరుడులకు అభిషేకం, హారతీ, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ, మంగళ హారతి నిర్వహించారు. శనివారం రాత్రి బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన జబర్దస్త్ ఫేం నిర్వహించిన కార్యక్రమాలు అలరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు కె. చంద్రయ్య, పి.యాదమ్మ, కె.మహేందర్, బాల్‌రాజ్, వెంకటేష్, ఈఓ మురళీకృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్మిక విభాగం అధ్యక్షుడు సంజయ్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పూజలు నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, డైరెక్టర్లు చల్లా నర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించి ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, మీర్‌పేట్ కార్పొరేటర్ చల్లా బాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నందిగామ నర్సింహ, నేతలు రాజు, బాల్‌రాజ్, కొమరయ్య, కుమార్, చంద్రమోహన్, యాదయ్య, రమేష్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, సిరిగిరిపురం సర్పంచ్ కాసుల సురేష్ పాల్గొన్నారు. మండలంలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ అనితారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాకేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, ఆలయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న వీరేందర్ గౌడ్ తదితరులు

ప్రజల కష్టాలు తెలుసుకునేందుకే పాదయాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

ప్రశాంత్‌కుమార్‌రెడ్డిపై మంత్రి సబితారెడ్డి ప్రశంసల జల్లు

ఇబ్రహీంపట్నం: యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర స్ఫూర్తిదాయకమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పీ సబితారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రగతి నివేదన పాదయాత్ర ఇబ్రహీంపట్నంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సబితారెడ్డి హాజరై మాట్లాడారు. రాజకీయాలను టైంపాస్‌గా తీసుకోకుండా ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు ప్రశాంత్‌రెడ్డి పాదయాత్ర చేపట్టడం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. తండ్రి రాజకీయ నాయకత్వాన్ని పుణికిపుచ్చుకున్న ప్రశాంత్‌రెడ్డికి తన ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. పాదయాత్ర సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు ప్రశాంత్‌రెడ్డి దృష్టికి వచ్చాయని, ఆయన తనకు ఫోన్ ద్వారా వివరించినట్లు మంత్రి తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలం అయ్యిందన్నారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా పథకాలు ప్రజలకు నేరుగా దక్కుతున్నట్లు చెప్పారు. మంత్రి కేటీఆర్‌కు రాష్ట్రంపై పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్రానికి పలు కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, ఎంపీపీ కృపేష్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మద్యం మత్తు.. త్రిబుల్ రైడింగ్

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్
- యువకుడి మృతి

రాంగోపాల్‌పేట్: ముగ్గురు స్నేహితులు కలిసి మద్యం సేవించారు..అర్ధరాత్రి బైక్‌పై బిర్యానీ కోసం వెళుతుండగా వాహనం అదుపు తప్పి విద్యుత్ పోల్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన వాసుదేవ్ సాహూ (21) చిత్తరంజన్ (28), రిలీఫ్ సాహూ స్నేహితులు. రిలీఫ్ సాహూ పంజాగుట్టలో ఉంటూ ఓ చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తుండగా, మిగతా ఇద్దరు కూడా వెస్ట్ మారేడుపల్లిలోని హోటల్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. రిలీఫ్ సాహూ ఆదివారం సొంతూరు వెళుతుండటంతో శనివారం రాత్రి వెస్ట్‌మారేడుపల్లికి వచ్చాడు. ముగ్గురు కలిసి అక్కడే మద్యం సేవించారు. అనంతరం బిర్యానీ తినేందుకు బైక్‌పై క్లాక్‌టవర్ వద్దకు వచ్చారు. అక్కడి నుంచి సంగీత్ చౌరస్తా వైపు వెళుతుండగా బైక్ నడుపుతున్న సహదేవ్ సాహూ వేగంగా డీ మార్ట్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో రిలీఫ్ సాహూకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిననట్లు వైద్యులు నిర్ధారించారు. వాహనాన్ని నడుపుతున్న వాసుదేవ్ సాహూ స్వల్ప గాయాలు కాగా, చిత్తరంజన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని..

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్: మద్యం తాగేందుకు రూ. 100 అడిగితే ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తలుపులూరు గ్రామానికి చెందిన కొరమోని స్వామి(45) భార్య రాణితో కలిసి బతుకు దెరువు నిమిత్తం నగరానికి వచ్చి జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్ బస్తీలో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా స్వామి మద్యానికి బానిసయ్యాడు. శనివారం అంతా మద్యం తాగుతూనే ఉన్నాడు. ఆదివారం ఉదయం మద్యం కోసం స్థానికంగా ఉన్న ఓ బెల్టుషాప్‌నకు వెళ్లి అడగగా డబ్బులిస్తేనే క్వార్టర్ ఇస్తానంటూ సదరు వ్యాపారి చెప్పడంతో ఇంటికి వచ్చిన అతను భార్యను రూ. 100 అడిగాడు. తన వద్ద డబ్బు లేదని ఆమె చెప్పడంతో ఆగ్రహానికిలోనైన స్వామి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుక్షణం.. అప్రమత్తం

- 36 ఏళ్ల తర్వాత ఒకేసారి రెండు జాగరణలు
- అప్రమత్తమైన నగర పోలీసులు
- కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో ప్రశాంతంగా ముగిసిన వేడుకలు
- పాతబస్తీలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పర్యటన


చార్మినార్ వద్ద డీసీపీతో కలిసి పరిస్థితిని సమీక్షిస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్: రెండు వర్గాలకు చెందిన జాగరణలు 36 ఏళ్ల తరువాత ఒకేసారి రావడంతో నగర పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ఓ వైపు హిందువులు భక్తి శ్రద్ధలతో నిర్వహించే మహాశివరాత్రి వేడుకలతో పాటు రంజాన్ మాసానికి ముందుగా వచ్చే షబ్-ఏ-మేరాజ్‌ను పురస్కరించుకుని నిర్వహించే జగ్నేకీ రాత్ రెండు ఒకే రోజు ఉండటంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌తో పాటు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఇతర పోలీసు ఉన్నతాధికారుల బృందం పాతబస్తీలో పర్యటించింది. సైదాబాద్‌లోనూ పర్యటించిన సీపీ అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఇరువర్గాల జాగరణలు ఒకేసారి ఉండటంతో ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. ఇరువర్గాల జాగరణలు ప్రశాంతంగా ముగియడంతో అటు పోలీసులతో పాటు ఇటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... 36 ఏళ్ల తరువాత ఇరువర్గాల జాగరణలు ఒకే రోజు వచ్చాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పాతబస్తీలో స్థానిక పోలీసులతో పాటు 10 ప్లాటూన్ల పోలీసులతో అదనపు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

భార్యకు తెలియకుండా విడాకులు !

సాక్షి, సిటీబ్యూరో: డబ్బుల కోసం కట్టుకున్న భార్యను, చనిపోయిన కన్న తల్లినీ మోసం చేశాడు. భార్యకు తెలియకుండా విడాకులు ఇవ్వడమే కాకుండా ఆమె పేరున ప్రాపర్టీ కొనుగోలు చేసి, ప్రతి నెలా ఈఎంఐ కిరికిరిలో భార్యను ఇరికించేశాడు! చనిపోయిన తల్లి సంతకం ఫోర్జరీ చేసి డబ్బు కాజేశాడు. ఈ సొమ్ము భార్య, భర్తల జాయింట్ ఖాతాలో జమకావడంతో తన ప్రమేయం లేకుండానే అటు బాధితురాలు, ఇటు నిందితురాలిగా మారింది ఓ భార్య! విచిత్రమైన ఈ కేసు గచ్చిబౌలి మహిళా ఠాణాలో నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్‌కు చెందిన అభిషేక్, అర్చన (పేర్లు మార్చాం)లు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి వైభవంగా పెళ్లి కూడా చేసుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగరీత్యా ఆ యువ జంట ఆస్ట్రేలియా వెళ్లింది. నాలుగైదు ఏళ్లు అన్యోన్యంగానే ఉన్నారు. ఆ తర్వాత అతడి అసలు రంగు బయటపడింది. చీటికీమాటికీ భార్యతో గొడవ పడుతుండటంతో అదే సమయంలో తల్లిదండ్రుల ఆరోగ్య సమస్యల రీత్యా.. ఆమె ఇండియాకు తిరిగొచ్చేసింది.దీంతో అభిషేక్ తన భార్య వెళ్లిపోయిందని విడాకులను కావాలని ఆస్ట్రేలియాలో కోర్టును ఆశ్రయించడంతో అక్కడి న్యాయస్థానం విడాకులు మంజూరు చేసింది.

విడాకుల విషయం దాచి..

ఆ తర్వాత ఇండియాకు వచ్చిన అతను భార్యకు విడాకుల విషయం చెప్పకుండా దాచేశాడు. అప్పటికే ఆమె గచ్చిబౌలిలోని ఓ బహుళ జాతి కంపెనీలో ఐటీ ఉద్యోగి. లక్షల్లో వేతనం కావటంతో ఆమె బ్యాంకు ఖాతాలోని డబ్బును ఎలాగైనా కాజేయాలని పథకం వేశాడు. ఎంచక్కా.. ఇద్దరి పేరున ఉమ్మడి బ్యాంకు ఖాతా తెరిచాడు. భార్యను సహ యజమానురాలిగా పెట్టి బ్యాంకు రుణంతో ఓ ఖరీదైన ప్రాపర్టీని కొనుగోలు చేశాడు. బ్యాంకు నెలవారీ వాయిదా ఆమె అకౌంట్ నుంచి జమ అయ్యేలా ప్లాన్ చేశాడు. అయితే ప్రాపర్టీ మీద వచ్చే అద్దె డబ్బును సొంతానికి వాడుకుంటున్నాడు.

చనిపోయిన తల్లి డబ్బు కాజేయాలని..

గతంలోనే అభిషేక్ తల్లి చనిపోయింది. అయితే ఆమె బ్యాంకు ఖాతాలోనే డబ్బు ఉందని తెలుసుకున్న అతను.. ఎలాగైనా దాన్నీ కొట్టేయాలని మరో స్కెచ్ వేశాడు. తల్లి బ్యాంకు చెక్ తీసుకొని అమ్మ సంతకం ఫోర్జరీ చేశాడు. ఈ చెక్‌ను ఉమ్మడి ఖాతా ఉన్న బ్యాంకులో డిపాజిట్ చేసి.. రూ.లక్షల్లో సొమ్ము తీసుకున్నాడు. ఈ విషయం అభిషేక్ సోదరికి తెలియడంతో ఆమె పోలీసు స్టేషన్‌లో ఫోర్జరీ కేసు పెట్టింది. దీంతో పోలీసులు అభిషేక్‌ను విచారించగా.. బండారం మొత్తం వెలుగులోకి వచ్చింది. ఆ అమ్మాయి తన భార్య కాదని అందుకే తనపై 498ఏ కేసు పెట్టేందుకు ఆమె అర్హురాలు కాదని అభిషేక్ పోలీసులతో వాగ్వాదం దిగడం కొసమెరుపు. అనధికారికంగా తల్లి ఖాతాలోని డబ్బు భార్య, భర్తలు ఉమ్మడి ఖాతాలోనే జమైంది కాబట్టి.. పోలీసులు భర్తతో సహా భార్యపై కూడా కేసు పెట్టారు. దీంతో ఆమె ఉద్యోగం పోగొట్టుకుని జైలుపాలైంది.